క్లుప్తంగా

శాకంబరీ అలంకరణలో అమ్మవారు



మహబూబాబాద్ రూరల్: ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మాంగల్యగౌరీ దేవి పార్వతిదేవికి ఆదివారం శాకంబరీ అలంకరణ జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులుసుధాకరశాస్త్రి, చిట్టా శ్రీకాంత్ శాస్త్రి ఆధ్వర్యంలో మాంగళ్యగౌరీదేవి పార్వతిదేవి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, పట్టు వస్త్రాలతో శాకంబరీ అలంకరణ చేశారు.

విజయ్‌బాబుకు శుభాకాంక్షలు



బయ్యారం/గార్ల: రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఆదివారం బాధ్యతలు చేపట్టిన మువ్వా విజయ్‌బాబును హైదరాబాద్‌లో నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దనియాకుల రామారావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, యాకూబ్‌పాషా, బాబూలాల్, కిషన్, అశోక్, వీరస్వామి, సనప సోమేష్, ప్రవీణ్‌నాయక్, పూసంరమేష్, తదితరులు ఉన్నారు.

31న చలో కలెక్టరేట్

నెహ్రూసెంటర్: జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం జూలై 23న అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు, 31వ తేదీన చలో కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి ఆదివారం పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతాంగ సమస్యలను పరిష్కరించి, కార్మికులకు కనీస వేతనం చెల్లించాలన్నారు. నూతన రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వాలన్నారు. పూర్తిస్థాయి రుణమాఫీ, పోడు భూములకు పట్టాలు ఇచ్చి పోడు రైతులను ఆదుకోవాలన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

పాకాల ఏటి వద్ద బారికేడ్ల ఏర్పాటు



గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటి వద్ద ప్రమాదాలను నివారించేందుకు ముందస్తుగా పోలీసులు ఆదివారం రాంపురం వెళ్లే రహదారికి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. 4 రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాకాల ఏరు చెక్‌డ్యాం పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గార్ల నుంచి రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై జీనత్‌కుమార్, తహసీల్దార్ రవీందర్ ఏటి వరద ఉధృతిని సందర్శించి, ముందు జాగ్రత్తగా రహదారికి అడ్డంగా బారిరికేడ్లు ఏర్పాటు చేశారు.

సమస్యలతో బడి సతమతం

- స్కూల్ ఆవరణ అపరిశుభ్రం
- శిథిలమైన భవనాలు
- తాగునీటికి ఇక్కట్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



లింగ్యాతండాలోని ప్రభుత్వ పాఠశాల



పనికి రాకుండా నిరుపయోగంగా ఉన్న తరగతి గది



మురికి కూపంగా చేతి పంపు పరిసరాలు



కిటికీలు శిథిలమై కనిపిస్తున్న తరగతి గది

కురవి: ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తున్నామని చెబుతున్న మాటలకు పొంతనలేకుండా ఉంది.. అసౌకర్యాలు, వసతులు, అపరిశుభ్రమైన పరిసరాలు, తాగునీటి అవస్థలు, శిథిలమైన భవనాలతో సరస్వతీ నిలయం సమస్యలతో సతమతం అవుతుంది. మండలంలోని బలపాల శివారు లింగ్యా తండా గ్రామంలో డీఎస్‌టీ ప్రాథమిక పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. పాఠశాలలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 23 మంది విద్యార్థులు స్కూల్‌లో ఉన్నా రోజు పదిమంది వస్తున్నారు. పాఠశాలలో సౌకర్యాలు లేకపోవడంతో ఊరికి దూరంగా గుట్టల మధ్య ఉన్న స్కూల్‌కు పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. పాఠశాల ఆవరణ మొత్తంగా పిచ్చి మొక్కలు నిండిపోయి ఉంది. పిల్లలు ఆవరణలో నడిచే పరిస్థితి లేకుండా పోయింది. భయంభయం మధ్య స్కూల్‌లో చదవాల్సిన పరిస్థితి ఉంది.


తలుపులు, కిటికీలు లేవు

పాఠశాలలో ప్రస్తుతం రెండు గదులు పనిచేస్తున్నాయి. మరో గదిలో గ్రామ పంచాయతీ కార్యాలయం నడుస్తోంది. మరో గది ఉన్నప్పటికీ ఆ గదికి తలుపులు, కిటికీలు లేకుండా ఉన్నాయి. అందులో పిల్లలకు చదువు చెప్పే పరిస్థితి లేదు. మరో గది పూర్తిగా శిథిలమైంది. వంటశాల కూలడానికి సిద్ధంగా ఉంది. పాఠశాల ఆవరణ పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండి ఉంది. కాలుబయట పెట్టాలంటే పురుగులు, తేళ్లు, పాములు కరుస్తాయోనన్న భయం వెంటాడుతోంది. పాఠశాల ఆవరణలోనే గ్రామ పంచాయతీ కార్యాలయం ఉన్నప్పటికీ అపరిశుభ్రంగా మారింది. శుభ్రం చేయించే పరిస్థితి కనిపించడంలేదు.

నిరుపయోగంగా నల్లా కనెక్షన్

పాఠశాలలో భగీరథ నీళ్లు రావడంలేదు. నల్లా కనెక్షన్ ఇచ్చినప్పటికీ అది నిరుపయోగంగా మారింది. స్కూల్ ఆవరణలో చేతిపంపు ఉంది. అయితే ఆ చేతిపంపు వద్ద మురుగునీరు నిల్వ ఉండడంతో చేతిపంపు నీరు ఉపయోగించడంలేదు. పిల్లలు ఇంటి వద్ద నుంచే మంచి నీటిని తెచ్చుకుంటున్నారు. చేతిపంపుతోపాటు మెయిన్‌గేట్ వద్ద బురదమయంగా ఉంది.

సమస్యలు పరిష్కరించాలి



డీఎస్‌టీ లింగ్యా తండా పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నాయి. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి. విద్యార్థులకు ఏమి కాక ముందే చర్యలు తీసుకోవాలి. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తాం. - గంధసిరి జ్యోతిబసు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు

ఎస్సైల బాధ్యతల స్వీకరణ



రమేశ్ బాబు, నెల్లికుదురు



మురళీధర్‌రాజు, కేసముద్రం



తిరుపతి, బయ్యారం

నెల్లికుదురు: నెల్లికుదురు ఎస్సైగా సీహెచ్ రమేశ్ బాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై క్రాంతికిరణ్ ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కాగా మాలమహానాడు జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్, మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్ తదితరులు మర్యాద పూర్వకంగా ఎస్సైని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కేసముద్రం: కేసముద్రం ఎస్సైగా మురళీధర్‌రాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించాడు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన వంశీధర్ బదిలీపై వీఆర్‌కు వెళ్లారు.

బయ్యారం: బయ్యారం ఎస్సైగా కె.తిరుపతి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఉపేందర్ పెద్దవంగరకు బదిలీ అయ్యారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పాత ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

తొర్రూరు రూరల్: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అన్నివర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సీలార్ సాహెబ్ కోరారు. ఆదివారం మండలంలోని అరిపిరాల, వెంకటాపురం, దుబ్బ తండా గ్రామాలను సందర్శించి కూలిపోయిన ఇళ్లు, పొంగిపొర్లుతున్న వాగులు, వంకలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని గుడిసెలు, పూరిళ్లు, రేకులు వంటి పాత ఇళ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని, ప్రస్తుత సమయంలో వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నాలు చేయడం, చేపలు పట్టడం వంటి వాటికి వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు వెల్తూరి వినయ్, కార్యదర్శి దేవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'దాశరథి' శతజయంతి

చిన్నగూడూరు: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాంపాలనను అంతమొందించిన తెలంగాణ ఉద్యమ రథసారథి దాశరథి కృష్ణమాచార్యులు. నేడు దాశరథి శతజయంతిని రాష్ట్ర వ్యాప్తంగా తెలిసేలా కమిటీ నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు పూర్తి చేశారు. శతజయంతి వేడుకలు చిన్నగూడూరులో ప్రారంభమైన తర్వాత చిన్నగూడూరు నుంచి మహబూబాబాద్ వరకు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించి, జిల్లా కేంద్రంలో శతజయంతిని నిర్వహించనున్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న సోమయ్య

నెహ్రూసెంటర్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. పార్టీ ఏటిగడ్డశాఖ సమావేశం ఆదివారం వాంకుడోత్ రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్నపు సోమయ్య మాట్లాడుతూ.. హామీలను అమలు చేయకుండా ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. విద్య, వైద్యం, నిత్యావసర ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. హామీలను విస్మరించిన బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతరాంనాయక్, శాఖ కార్యదర్శి బానోత్ ప్రకాశ్, బానోత్ సిజ్జిరామ్, వాంకుడోత్ మున్నీ, వాంకుడోత్ హచ్యా, సుధాకర్, చిన్న, శ్రీను, రాంకోటి, రాజేష్, దాము, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్



డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఆయిల్ ట్యాంకర్

మరిపెడ: ఓ ఆయిల్ ట్యాంకర్ స్పీడ్‌గా దూసుకొచ్చి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని సోమఫిల్లింగ్ స్టేషన్ సమీపంలోని నేషనల్ హైవేపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఖమ్మం నుంచి వరంగల్ వైపుగా వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని రోడ్డు మధ్యలో ఉన్న డివైడ్‌ను ఢీకొట్టింది. డివైడర్‌పై కొంత దూరం దూసుకెళ్లడంతో రెండు సెంట్రల్ లైటింగ్ స్తంభాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మున్సిపాలిటీ అధికారులు కనీసం డివైడర్ల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడం కారణంగానే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దంతాలపల్లి: మండలకేంద్రంలో ఎస్సారెస్పీ కెనాల్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. తొర్రూరు పట్టణానికి చెందిన ఎస్‌కె యూసుఫ్ తన సొంత పనులపై సూర్యాపేట్ వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో దంతాలపల్లి దగ్గర బైక్ అదుపు తప్పి పడిపోగా యూసుఫ్‌కు గాయాలయ్యాయి, గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో తొర్రూరు ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా 'గురుపౌర్ణమి' వేడుకలు



మహబూబాబాద్ రూరల్: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్



మరిపెడ రూరల్: చిల్లంచర్ల సాయిబాబా మందిరంలో..



గూడూరులో..



గార్ల సాయిబాబా మందిరంలో..



డోర్నకల్: అలంకరణలో సాయినాథుడు



కురవి: సాయిబాబా ఆలయంలో ..

మహబూబాబాద్ రూరల్: గురుపరంపరకు నిదర్శనంగా నిలిచే గురుపౌర్ణమి (వ్యాస పౌర్ణమి), సద్గురు వైభవం, సాయినాథుడి దివ్య దర్శనం వేడుకలను పట్టణంలోని శ్రీసాయి మందిరంలో ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. నగర సంకీర్తనతో సాయి పూజలు ప్రారంభించారు. ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ప్రత్యేక దర్శనం ద్వారా సాయినాథుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమల్‌కుమార్, చంద్రప్రకాశ్, రామకృష్ణ, ఘనపురపు అంజయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక సుభాష్‌వీధిలోని శ్రీషిర్డీసాయి ధ్యాన మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ఆవరణలో సామూహిక సాయి వ్రత అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కురవి: మండల కేంద్రంలోని సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమల్‌రావు, సీహెచ్.శ్రీనివాస్, కర్నాటి మోహన్‌రావు, బుక్క వీరన్న పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామం సాయిబాబా మందిరంలో మాజీ వైస్ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి, మరిపెడ కార్గిల్ స్థూప వ్యవస్థాపకులు గాదె రాంబాబు, ఉషా దంపతులు, అనంతుల వెంకటనర్సు పాల్గొని ప్రత్యేక ప్రజలు చేశారు.

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయంలో పాలాభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపూరు వెంకట్‌రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్‌గుప్త, సంగెపు బాబు, విజయ్ పాల్గొన్నారు.

గార్ల: గార్లలోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు బోనగిరి సుదర్శన్‌రావు, పుల్లఖండం రమేష్‌బాబు, పి.రాంబాబు, కందునూరి ఉపేందర్, జక్కుల పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని సాయి సంతోషి మందిరంలో గురుపౌర్ణమి పండుగ వేడుకలను బాబా మందిర నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

నూతన కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ అర్బన్: స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా నూతన అడహక్ కమిటీని జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం ఎన్నుకున్నట్లు ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చాగంటి రాజేష్ తెలిపారు. కమిటీ చైర్మన్‌గా కల్లెపల్లి రమేష్, కన్వీనర్ వెల్ది వినోద్, కోకన్వీనర్ గండు మురళీ, సభ్యులుగా గుంటోజు శరత్ చారి, లావుడ్య రాంబాబు, బి.రఘు, బానోత్ జ్యోతి, అజ్మీరా దాక్షి నాయక్, యాకయ్య, ఇబ్రహీంలను నియమించారు.

ఖర్గే జన్మదిన వేడుకలు

మహబూబాబాద్ రూరల్/గార్ల: ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదినోత్సవ వేడుకలను ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు బోడ రవినాయక్, పట్టణ ఓబీసీ అధ్యక్షుడు లింగాల వీరభద్రంగౌడ్, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణ గౌడ్, ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్, శంషాద్ బేగం, పృథ్వీరాజ్‌నాయక్, సుమన్, రవి, రజినీ, కమల, భూలి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులతో ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కంకర బోర్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1976–77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీ సమ్మేళనం నిర్వహించారు. 47 సంవత్సరాల తర్వాత కలుసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ ఉమా దంపతులను ఆహ్వానించారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుడ్ల రవి, రాజ్‌గౌడ్, రామారావు, కృష్ణయ్య, వెంకటరమణ, శ్రీరంగం వెంకటేశ్వర్లు, ఓంజీ, రంగా, నరసింహారావు పాల్గొన్నారు.

బైక్‌లో తాచుపాము హల్‌చల్

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని అరుణోదయ కాలనీలోని ఓ వ్యక్తి పల్సర్ బైక్‌లో పంచుకున్న తాచుపాము ఆదివారం మధ్యాహ్నం హల్‌చల్ చేసింది. స్థానికుల కథనం ప్రకారం దొమ్మటి అశోక్‌కు చెందిన పల్సర్ బైక్‌ను తన ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఉంది. బైక్‌ను తీసుకెళ్లే సమయంలో సీటు కింద పాము కనిపించింది. సీటును తొలగించడంతో అందులోంచి పాము పారిపోయింది.

సంక్షిప్త సమాచారం

పరిశుభ్రత పాటించాలి



గూడూరు: వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతీ ఒక్క ఇంటిలో పరిశుభ్రత పాటించాలని డాక్టర్ యమున అన్నారు. మండలంలోని మట్టివాడ శివారు నేలవంచలో ఆదివారం అయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రతీ ఇంటిలో నీరు నిల్వ చేసుకునే సిమెంట్ డ్రమ్ములు, గోళంలో పాకురును శుభ్రం చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్, సిబ్బంది సర్దార్‌బాబు, కృష్ణ, కవిత పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మరిపెడ రూరల్: కొత్తగా వచ్చిన రైతు పాస్ పుస్తకాల రైతులు ఆగస్టు 5వ తేదీతో రైతు బీమా ముగుస్తున్నందును రైతు బీమాకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని గిరిపురం రైతు వేదిక సెక్టర్ ఏఈఓ శ్రీకాంత్ రైతులకు సూచించారు. రైతు పట్టాదారు పాస్ బుక్ లేదా తహసీల్దార్ డిజిటల్ సంతకం అయినా డీఎస్ పేపర్, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో సంప్రదించాలని కోరారు. 14 ఆగస్టు 1965 నుంచి 14 ఆగస్టు 2006 మధ్యలో జన్మించి 18 నుంచి 59 ఏళ్ల ఉన్న రైతులు మాత్రమే రైతు బీమాకు అర్హులుగా పేర్కొన్నారు.

కనకదుర్గను దర్శించుకున్న ఎమ్మెల్యే

మరిపెడ రూరల్: ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రు నాయక్ కుటుంబ సమేతంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు.

అవార్డు ప్రదానం

డోర్నకల్: హైదరాబాద్‌లో స్థిరపడి రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న డోర్నకల్ మండలం ఉయ్యాలవాడకు చెందిన సాంపంగి రమేష్ మరో పురస్కారం అందుకున్నారు. అబుదాబిలో ఇటీవల రేడియో సిటీ ఆధ్వర్యంలో బిజినెస్ టైటాన్స్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో అత్యంత విశ్వసనీయత బ్రాండ్ (మోస్ట్ ట్రస్టెడ్ బ్రాండ్) అవార్డును సినీ నటుడు సోనూసూద్ చేతుల మీదుగా సాంపంగి రమేష్ అందుకున్నారు.

ఆర్థికసాయం

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌కి చెందిన దేశబోయిన కుమారస్వామి తండ్రి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు ఆదివారం కేసముద్రంస్టేషన్ జెడ్పీహైస్కూల్ 1993–94కి చెందిన ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు మిత్రుడికి రూ.17వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో సట్ల శ్రీను, చిల్లంచర్ల సతీష్, నీలం దుర్గేష్, కముటం శ్రీనివాస్, కముటం స్వామి, రామడుగు ధర్మాచారి పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లు ఐక్యంగా ఉండాలి

కురవి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఫొటోగ్రాఫర్లు ఐక్యంగా ఉండాలని మండల ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు కుంట యాదగిరి అన్నారు. ఈనెల 26, 27, 28వ తేదీల్లో హైదరబాద్‌లో జరిగే ఫొటోట్రేడ్ ఎక్స్‌పో కార్యక్రమం వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు.

మానవత్వం చాటుకున్న రాజేష్

దంతాలపల్లి: మండలకేంద్రానికి చెందిన సేను రాజేష్ మానవత్వం చాటుకున్నాడు. ఆదివారం మండలకేంద్రానికి చెందిన గడ్డం రవి సైకిల్‌పై వెళ్తూ బస్టాండ్ సమీపంలో అదుపు తప్పిపడిపోయాడు. దీంతో రవికి తీవ్రగాయాలయ్యాయి. అది గమనించిన రాజేష్ గాయాలైన రవి ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాడు.

వరినాట్లు షురూ



కేసముద్రం: మహబూబాబాద్ జిల్లాలో అంతటా ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం సరైన వర్షాలు లేకపోవడంతో వరినారు వేసుకున్న రైతులంతా వర్షాల కోసం ఎదురుచూస్తుండిపోయారు. వర్షాలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ, నాట్లు వేసే పనిలో మునిగిపోయారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా అశోక్



కేసముద్రం: కేసముద్రం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన మామిడి అశోక్ ఎన్నికయ్యారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని గణపతి ఫంక్షన్ హాల్‌లో పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ లక్ష్మీనర్సింహరావు సమక్షంలో క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రావుల నవీన్‌రెడ్డి, కోశాధికారిగా లక్కాకుల సత్యానారాయణ ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ చిర్ర యాకాంతంగౌడ్, కోచైర్మన్ చందాగోపి, రీజియన్ చైర్మన్ ఆర్.వెంకట్‌రెడ్డి, జోన్ చైర్‌పర్సన్ రవిచందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఉప్పరగూడెంలో బోనాల వేడుకలు



పెద్దవంగర: మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో బోనాల పండగను ఆదివారం గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ శివారులో ఉన్న ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం కావడంతో గ్రామ దేవతకు గ్రామస్తులంతా ఇంటికి ఒక్క బోనం చొప్పున మహిళలు డప్పు చప్పుల నడుమ ఊరేగింపుగా దేవతలకు వద్దకు తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఎలాంటి వ్యాధులు సోకకుండా చూడాలని తల్లిని వేడుకున్నారు. వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని మొక్కుకున్నట్లు మహిళలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జమున సమ్మయ్య, స్థానిక మహిళలు పాల్గొన్నారు.